క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ నాయకుడు కె. ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, కె. రామకోటేశ్వరరావు, పి.రత్నరాజు, జె.గోపి, పి.ఆంజనేయులు, సయ్యద్ రబ్బాని, మహ్మద్ రఫీ సయ్యద్, ఎం.థామాసు పాల్గొన్నారు.

శిబిరంలో 95 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కండ్రిక మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ వైద్యుడు కిరణ్ 40 మందికి పలు పరీక్షలు చేశారు. మరో 45మందికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో స్కానింగ్ పరీక్షలు చేశారు. వీరిలో గుండె సంబంధిత వ్యాధి లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి తమ వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా వైద్యం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కండ్రిక మహిళా మండలి నిర్వాహకులు నరసింహారావు, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనాల కంపెనీలో తనిఖీలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారులోని తులసీ సీడ్స్ కంపెనీలో విత్తనాలను సహాయ వ్యవసాయ సంచాలకులు శంకరరెడ్డి, సురేష్ బుధవారం తనిఖీ చేశారు. వివిధ లాట్ నంబర్లను పరీక్షించారు. బీటీ విత్తనాలలో గ్లైసల్ జన్యువు ఉన్నదీ లేనిదీ పరీక్షించినట్లు తెలిపారు. గ్లైసల్ జన్యువు ఉన్న పత్తి విత్తనాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. అందులో భాగంగా వ్యవసాయ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు సీడ్స్‌లోని 16లాట్‌లను ఎంపికచేసుకొని తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం అధికారి కె.రమణ, ఏవో వాసంతి, సీడ్స్ మేనేజర్ హనుమంతరావు, విస్తరణాధికారి సుభాని, వ్యవసాయ సహాయకులు హకీంలు పాల్గొన్నారు.

పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



తాడేపల్లి రూరల్: పసుపు రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.15 వేలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో బుధవారం పసుపు కల్లాలోని పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పసుపు రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం క్వింటాకు మద్దతు ధర రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. పెట్టుబడులు పెట్టి, పసుపు పండించిన రైతుకు కష్టం తప్పా మిగిలేది ఏమీ లేదని వివరించారు. పసుపు రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, క్వింటా మద్దతు ధర రూ. 15 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, కొండా నాగిరెడ్డి, సామ్యేలు, శరత్ బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత



తాడికొండ: ఓటు హక్కు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యతని తాడికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. గంగరాజు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొనేలా చూడాలని చెప్పారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సక్రమంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు అవసరమని కోరారు. అనంతరం నేతల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, ఏఈఆర్వోలు మోహర్ కుమార్, హరిబాబు, ప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ నల్లా పాల్గొన్నారు.

నగరం నడిబొడ్డున అగ్ని గుండం



బ్యాంక్ కాలనీలో బాణసంచా దుకాణం

- ఇళ్ల మధ్య బాణసంచా నిల్వలు
- భయం గుప్పిట్లో నివాసితులు
- టీడీపీ నాయకుడు యజమాని కావడంతో కన్నెత్తి చూడని అధికారులు

మంగళగిరి: మండు వేసవిలో పట్టణం నడిబొడ్డున బాణసంచా నిల్వలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బ్యాంక్ కాలనీలో ఇళ్ల మధ్యనున్న దుకాణంతో నివాసితులు భీతిల్లుతున్నారు. గోడౌన్ ఆటోనగర్‌లో ఉందని, బ్యాంక్ కాలనీలో మోడల్స్



దుకాణంలో బాణసంచా నిల్వలు

పెట్టుకునేందుకు మాత్రమే దుకాణాన్ని వాడుతున్నామని నిర్వాహకులు చెబుతున్నా ప్రజలు భయపడుతూనే ఉన్నారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం తప్పదు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

దుకాణ యజమాని బెదిరింపులు


టీడీపీకి చెందిన దుకాణ యజమాని ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. కొద్ది రోజుల కిందట జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. స్థానిక అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు జిల్లా అధికారులకు మామూళ్లు అందుతున్న కారణంగానే తాము పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> బాణసంచా దుకాణాలను పట్టణానికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరాం. ఆదేశాలు వచ్చిన వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. –వెంకటేశ్వర్లు, అగ్నిమాపక శాఖ అధికారి, మంగళగిరి

ప్రయాణికుల గుండెల్లో దడ

పట్టణంలోని చినకాకాని, ఆత్మకూరు జాతీయ రహదారుల వెంట మరో రెండు బాణసంచా దుకాణాలు ఉన్నాయి. చినకాకానిలోని దుకాణంలో ప్రమాదం జరిగిన సమయంలో టపాసులు పేలి రోడ్డు పైకి దూసుకురావడంతో అటుగా వెళ్లడానికి ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. ప్రమాదాలు జరిగిన సమయంలో మొక్కుబడిగా చర్యలు తీసుకుంటున్న అధికారులు అనంతరం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా దుకాణాలను పట్టణానికి దూరంగా తరలించి, ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

మంగళగిరి: నియమ, నిబంధనలు ఉల్లఘించి నడుస్తున్న కేఎంఆర్ న్యాయ కళాశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పర్చూరి నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నగర పరిధిలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లో గల ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్ మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. నారాయణ గౌడ్ మాట్లాడుతూ సెక్షన్ 20 ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 ప్రకారం ఒక ఏరియాలో కొత్త కళాశాల ఏర్పాటు చేయాలనుకున్నపుడు ఉన్నత విద్యా మండలి పర్యవేక్షించిన అనంతరం అవసరాన్ని బట్టి పేపర్ నోటిఫికేషన్ ఇవ్వాలని తెలిపారు. నిబంధనలు పాటించకుండా, యూనివర్సిటీ అనుబంధం లేకుండా చట్ట విరుద్ధంగా అక్రమ మార్గంలో కళాశాలను నిర్మించారని ఆరోపించారు. కళాశాలలో ఒకే భవనంలో నాలుగు కోర్సులు నిర్వహించడం అన్యాయమని పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన లా విద్యార్థులను ఇతర కళాశాలలకు బదిలీ చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, నక్కా గోపీచంద్, సాయి, సునీల్, సూర్య, రవీంద్ర, దుర్గారావు పాల్గొన్నారు.

మురుగు కాలువపై వంతెన నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, ఎంపీపీ షేక్ జబీన్

దుగ్గిరాల: గత ప్రభుత్వంలో దుగ్గిరాల మండలం మంచికలపూడిలో మురుగు కాలువపై వంతెనకు బుధవారం భూమిపూజ చేశారు. దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ, ఎంపీపీ షేక్ జబీన్ భూమిపూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో దాసరి అరుణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే వంతెన నిర్మాణానికి రూ.2.30 లక్షలు మంజూరయ్యాయని, ఎన్నికలు రావడం వల్ల పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు. ఎంపీపీ షేక్ జబీనా మాట్లాడుతూ వంతెన నిర్మాణం వల్ల కె.ఆర్.కొండూరు, మంచికలపూడి గ్రామాలకు రవాణా సౌకర్యం పెరుగుతుందని చెప్పారు. 20 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మిస్తున్నారని, 18 నెలలు పట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంర్పంచ్ వై.చంద్ర దుర్గా భవాని, ఎంపీటీసీ సభ్యులు, కె.భాస్కరరావు, ఏఈ మురళి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు



మాట్లాడుతున్న బాల వజ్రబాబు

తాడికొండ: నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్షులు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని కార్యకర్తలను సమన్వయం చేసుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బుధవారం గుంటూరులోని స్వగృహ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నిక కాబోతున్న పార్టీ గ్రామ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని బాల వజ్రబాబు మాట్లాడుతూ పార్టీకి కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తా బలమైన పునాదులు వంటి వారని, వారందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి ముందుకు నడిపించాల్సిన బాధ్యత అధ్యక్షులపై ఉందని తెలిపారు. ఆచితూచి అడుగులు వేయాలని, గతంలో ఏవైనా చిన్నపాటి విభేదాలుంటే విడనాడాలని సూచించారు. భవిష్యత్తులో పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లడం ద్వారా అసాధారణ విజయాలను సాధించవచ్చని తెలిపారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి ఆదరణ భారీగా పెరుగుతుందని వనమా బాల వజ్రబాబు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ధరలు విపరీతంగా పెంచుతూ గుదిబండలా మారి వేధిస్తోందని విమర్శించారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమం ఆగలేదని, ప్రజలకు నేరుగా ఖాతాలలో నగదు జమ అయినట్లు చెప్పారు. ఒక్క రూపాయి అవినీతి జరగకుండా సుపరిపాలన అందించినట్లు వివరించారు. ఇప్పుడు సంక్షేమం పూర్తిగా పక్కకు నెట్టి కక్షలు, కార్పణ్యాలతో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. కూటమి అరాచకాలకు ఏ ఒక్కరూ దడవాల్సిన అవసరం లేదని అభయమిచ్చారు. పార్టీ గ్రామ అధ్యక్షుల ఏకాభిప్రాయంతో మండల అధ్యక్షులు నియామకం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చిందని, త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఫిరంగిపురం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మేడికొండూరు మండల అధ్యక్షుడు తాళ్ళూరు వంశీ, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి బత్తుల కిశోర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పుల శేషగిరిరావు, తాళ్ల శివనాగరాజు, మన్నవ రాజేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం

గుంటూరులోని స్వగృహ ఫంక్షన్ హాల్‌లో గురువారం వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పదవులకు ఎంపికైన నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు తెలిపారు. కార్యక్రమం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుందని, నేతలంతా హాజరుకావాలని ఆయన సూచించారు.

కేఎల్‌యూను సందర్శించిన మలేసియా కేలాంటాన్ ప్రతినిధి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని మలేసియా కేలాంటాన్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ముహమ్మద్ బిన్ మన్సూర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేఎల్‌యూలోని పరిశోధనా బృందంతో చర్చలు జరిపారు. అనంతరం మన్సూర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు గల పరిశోధన శాలలు, పరిశోధకులు ఉన్న కేఎల్‌యూతో పరిశోధన, పరస్పర సహకారం కోరుతూ తమ యాజమాన్యం ఇక్కడకు పంపినట్లు చెప్పారు. యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో ఒప్పందం చేసుకోవాలని, ఉమ్మడి కార్యకలాపాలను విస్తృతం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం. కిశోర్‌బాబు మాట్లాడుతూ రెండు యూనివర్సిటీల బృందాలు కలసి వివిధ అంశాలపై పరిశోధనలను మరింత ముందుకు తీసుకు వెళ్లడంపై చర్చలు జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్ మారుతి, బయో టెక్నాలజీ ప్రొఫెసర్ ఆరిపుల్లా, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాటల గారడీతో మోసం చేస్తున్న చంద్రబాబు

మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: గెలవక ముందు ఒక మాట... గెలిచిన తరువాత ఇంకో మాట చెబుతూ చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీడీఆర్) ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి తాడేపల్లి రూరల్ పరిధిలోని అన్ని గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకుల సమావేశాన్ని రూరల్ పార్టీ అధ్యక్షులు అమరా నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేమారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో, దేశంలో ఏ నాయకుడు సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చేయని విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారని తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు.. వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి 10 రూపాయలు ఇస్తే తాను 15 ఇస్తానంటూ ప్రజల్ని నమ్మించారని తెలిపారు. తీరా 10 నెలలు గడిచిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు అడుగుతుంటే ఖజానా ఖాళీగా ఉంది, డబ్బులు సంపాదించే ఉపాయం ఉంటే చెప్పండి, సంపాదించి ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని వేమారెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు అండగా ఉండి మనతో నడుస్తారని, కేసులకు భయపడవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ గౌరవ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు మేకా శివారెడ్డి, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దశల వారీగా పార్కులు, చెరువుల అభివృద్ధి

మంత్రి లోకేష్



పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

మంగళగిరి టౌన్ : నగర పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కును బుధవారం మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0.35 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కును రూ. 1.06 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో 30కి పైగా పార్కులు, చెరువులు ఉన్నాయని, వాటిని దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద రూ. 9 కోట్లతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. చినకాకాని, నులకపేటలో వున్న లేక్ పార్కులను కూడా అభివృద్ధి చేసి వాకర్స్‌కు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ ఆలీమ్‌బాషా, పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సమయానికి రాని 108 వాహనం



తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారిపై పోలకంపాడు ఓపెన్ థియేటర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. రుద్ర ముత్యాలు అనే యువకుడు ద్విచక్ర వాహనంపై నవులూరు నుంచి విజయవాడ వెళుతుండగా, పోలకంపాడు ఓపెన్ థియేటర్ వద్ద ఎదురుగా వస్తున్న రెండు కార్లు ఒక దాని ఒకటి క్రాస్ చేసుకుంటున్నాయి. ఈ సమయంలో ఆ కారు వెనుక ఉన్న ఒక ఆటో వెనుక భాగం రుద్ర ముత్యాలు వాహనానికి తగలడంతో రోడ్డుపై పడ్డాడు. ఇదే సమయంలో మంగళగిరి నుంచి బంధువుల సహాయంతో విజయవాడలోని ఆసుపత్రికి వెళుతున్న నాగరాజు, రుద్ర ముత్యాలు వాహనాన్ని ఢీకొట్టి కిందపడ్డాడు. దీంతో వీరిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు ఇద్దరిని చెట్టు కింద కూర్చోబెట్టి 108కు ఫోన్ చేశారు. 45 నిమిషాల వరకు వాహనం రాలేదని, అక్కడే ఉన్న రుద్ర ముత్యాలు బంధువుల ఆరోపించారు. విషయం తెలుసుకుని ఆటో మాట్లాడుకుని నవులూరు నుంచి వచ్చామని, వాహనం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'చంద్ర' ఆశయ సాధనకు కృషి చేద్దాం



రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి ముసునూరు సుహాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మానికొండ డాంగేతో కలిసి కాశయ్య, సుహాస్‌లు రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ పోరాట యోధుడు, సీపీఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధన కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సంపన్న కుటుంబంలో పుట్టినా, పేదలు, అణగారిన వర్గాల కోసం ఎర్రజెండా చేతబూనినట్లు చెప్పారు. యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. పేదలకు సాగు భూములు, ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలు చేసి జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మునగాల రామారావు, షేక్ ఖాసిం, బాషా, ప్రసన్న కుమార్, ప్రశాంత్‌రాజు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్‌లో..

చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చంద్ర రాజేశ్వరరావు 28 సంవత్సరాలు అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి, ఉత్తమ కమ్యూనిస్టుగా సేవలు అందించారని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్ర పోషించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతులు, కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారని గుర్తుచేశారు. అనంతరం నగరపరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, పార్టీ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

తల్లి పాలతో శిశువుల్లో రోగ నిరోధకశక్తి పెంపు




బాలింతలకు కిట్ అందజేస్తున్న ఎయిమ్స్, యూపీహెచ్‌సీ వైద్యులు

మంగళగిరి టౌన్: ఎయిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ సెంటర్‌లో బుధవారం తల్లిపాలు ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. ధనసు మాట్లాడుతూ గర్భిణులు, పాలిచ్చే మహిళలకు సరైన ఆరోగ్య సంరక్షణ, ప్రస్తుత సౌకర్యాల గురించి అవగాహన పెంచడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గర్భధారణ, ప్రసవానంతరం మహిళలకు ఆరోగ్య విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. తల్లిపాలు శిశువులకు ఎంతో శ్రేయస్కరమని, రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఎంతో దోహదపడతాయని వివరించారు. కళారూపం ద్వారా ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థినులు తల్లిపాలు బిడ్డకు ఎంత సురక్షితమో అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు సంపూర్ణ పోషకాహారాలు కలిగిన రాగి పిండి, జొన్న పిండి, పాలు, కోడిగుడ్లు కలిగిన కిట్లను అందజేశారు. యూపీహెచ్‌సీ వైద్యులు అనూష మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్య సమస్యలపై ప్రతి నెలా 9,10 తేదీల్లో సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వందన, నర్సింగ్ కాలేజీ ట్యూటర్లు ధనశేఖర్, ప్రియ, కాశేశ్వరి, అరవింద్ జాషి, వికాస్ పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై మహిళల నిరసన


రోడ్డుపై కట్టెల పొయ్యిపై వంట



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మహిళలు

మంగళగిరి: గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై మహిళలు వినూత్న నిరసన తెలిపారు. నగర పరిధిలోని నిడమర్రులో రోడ్డుపై బుధవారం కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల భారం మోపి తమ జీవితాలను దుర్భరం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కరెంట్ చార్జీలు ఒక్కసారిగా మూడు రెట్లు పెంచి రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటోందని తెలిపారు. ఇప్పుడు గ్యాస్ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలను దుర్భరంగా మారుస్తోందని విమర్శించారు. పెంచిన గ్యాస్ భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికలలో విద్యుత్ చార్జీలు, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచమని పేదల ఓట్లతో చంద్రబాబు, మోదీలు అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. నేడు పేదల జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. భాగ్యరాజ్, ఎం. అంకమ్మరావు, ఏ. కోటేశ్వరరావు, కె.సరళ, పి.ఎలీశమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభం రోజే విద్యా కిట్ల పంపిణీ



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ, జిల్లా సమగ్ర శిక్ష సిబ్బంది

దుగ్గిరాల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తరగతుల ప్రారంభం రోజునే సరేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేస్తామని ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకి బుధవారం గుంటూరు జిల్లా సమగ్ర శిక్షా అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కిట్లలో పాఠ్య పుస్తకాలు, మూడు జతల ఏక రూప దుస్తులు, బూట్లు అందించనున్నట్లు తెలిపారు. మండలానికి స్టాక్ పాయింట్‌గా బాలుర పాఠశాలను నిర్ణయించినట్లు చెప్పారు. స్టాక్ భద్రత, కిట్ల పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఆఫీసర్ దార్ల అనిల్, ప్రథమ్ టీం జిల్లా కో–ఆర్డినేటర్ బి.చక్రవర్తి, ఏఈ సీహెచ్. నాగేంద్ర, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో యువకులకు గాయాలు



తాడేపల్లి రూరల్: కారు ప్రమాదంలో నలుగురు యువకులకు గాయాలయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి నుంచి గుండిమెడ వైపు పొలిమేర డొంకలో అతి వేగంగా వెళుతున్న కారు ఓ చెట్టును ఢీకొట్టింది. అది తిరగబడడంతో ముందుభాగమంతా నుజ్జునుజ్జు అయ్యింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. యువకులు మద్యం మత్తులో అతివేగంతో కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు గాయాల పాలైన యువకులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.